# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 07-04-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జరుగుతున్న స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డ్ సమావేశంలో పాల్గొన్నారు.**
2. **భవిష్యత్తు తరాల కోసం నీటిని కాపాడుకోవడం తప్పనిసరి అని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.**
3. **విశాఖపట్నంలోని రుషికొండ ప్యాలెస్‌ను ప్రజల సందర్శనకు అనుమతించడంతో పాటు, ప్రభుత్వానికి ఆదాయ వనరుగా మార్చే దిశగా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.**
4. **విజయవాడలో ట్రాఫిక్ సమస్యలను తగ్గించే దిశగా మూడు ప్రధాన రహదారుల విస్తరణ పనులకు మంత్రి పి.నారాయణ ఈరోజు శంకుస్థాపన చేస్తారు.**

===========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జరుగుతున్న స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డ్ – ఎస్ఐపీబీ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో పరిశ్రమలు, విద్యుత్, పర్యాటకం, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో వేర్వేరు పెట్టుబడి ప్రతిపాదనలపై చర్చ జరుగుతోంది. మంత్రులు నారా లోకేష్, కె.అచ్చెన్నాయుడు, అనగాని సత్యప్రసాద్, టీజీ భరత్, గొట్టిపాటి రవికుమార్, కందుల దుర్గేష్, నారాయణ, వాసంశెట్టి సుభాష్, బీసీ జనార్ధన్ రెడ్డి, సీఎస్ సాయిప్రసాద్ సహా ఆయా శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ మధ్యాహ్నం రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్)పై ముఖ్యమంత్రి సమీక్షిస్తారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఈ సాయంత్రం అమరావతిలోని పరేడ్ గ్రౌండ్ లో సుమారు 33 కోట్ల రూపాయలతో అగ్నిమాపక శాఖ కొత్తగా సమకూర్చుకున్న 25 అధునాతన నీటి ట్యాంకర్లు, 40 తక్షణ స్పందన వాహనాలు, 50 గాలితో నింపే రబ్బరు పడవలు, 30 శ్వాస ఉపకరణ కంప్రెసర్లను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జెండా ఊపి ప్రారంభిస్తారని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

---------------------------

భవిష్యత్తు తరాల కోసం నీటిని కాపాడుకోవడం తప్పనిసరి అని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ అన్నారు. విజయవాడ పరిధిలోని కానూరు గ్రామీణాభివృద్ధి సంస్థ కార్యాలయంలో గ్రామీణ తాగునీటి సరఫరా వ్యవస్థలో జలవనరుల స్థిరత్వంపై వర్క్ షాప్ ఈరోజు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప

ముఖ్యమంత్రి కే. పవన్ కల్యాణ్ పాల్గొని మాట్లాడారు. జల్ జీవన్ మిషన్ 2.0లో జల సంరక్షణకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. నీరు ఎక్కడుంటే అక్కడ అభివృద్ధి బాగుంటుందని, ప్రజల జీవన స్థితిగతులు మెరుగుపడతాయని పేర్కొన్నారు.

---------------------------

విశాఖపట్నంలోని రుషికొండ ప్యాలెస్‌ను ప్రజల సందర్శనకు అనుమతించడంతో పాటు, ప్రభుత్వానికి ఆదాయ వనరుగా మార్చే దిశగా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో విశాఖపట్నం రుషికొండ భవనాల (ప్యాలెస్) వినియోగంపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీ 5వ సమావేశం ఈరోజు జరిగింది. కోస్టల్ రెగ్యులేషన్ జోన్ – (సీఆర్ జెడ్) నిబంధనల ప్రకారం హిల్ టాప్ పైన 2400 చదరపు మీటర్లు, కొండ కింద మరో 2400 చదరపు మీటర్లు.. మొత్తంగా 4800 చదరపు మీటర్ల భూమి అందుబాటులో ఉన్నట్లు కమిటీ గుర్తించిందని మంత్రి పేర్కొన్నారు. ఈ అంశాలతో తుది నివేదికను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు సమర్పిస్తామని, అనంతరం ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్ర కేబినెట్‌లో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని మంత్రి వెల్లడించారు.

---------------------------

త్వరలోనే విజయవాడ గ్రేటర్ విజయవాడ అవుతుందని పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ తెలిపారు. విజయవాడలో ఆయన పాత్రికేయుల సమావేశం ఈరోజు నిర్వహించారు. అమరావతి రాజధానిగా పూర్తి స్థాయిలో పార్లమెంట్ లో ఆమోదం పొందిందనీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాశ్వత రాజధానిగా అమరావతి రూపుదిద్దుకుంటుందని చెప్పారు. త్వరలోనే గ్రేటర్ విజయవాడ కూడా అవుతుందని ఎంపీ కేశినేని శివనాథ్ పేర్కొంటూ..

వాయిస్..30 సెకన్లు

---------------------------

విజయవాడలో ట్రాఫిక్ సమస్యలను తగ్గించే దిశగా మూడు ప్రధాన రహదారుల విస్తరణ పనులకు పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ ఈరోజు శంకుస్థాపన చేయనున్నారని అధికారులు తెలిపారు. విజయవాడ ఈస్ట్, పెనమలూరు, గన్నవరం నియోజకవర్గాల పరిధిలో ఈ పనులు చేపడుతున్నట్లు అధికారులు పేర్కొన్నారు. రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ – సీఆర్డీఏ నిధులతో సుమారు 105 కోట్ల రూపాయలతో రోడ్ల విస్తరణ పనులు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ పనులు పూర్తయిన తర్వాత నగర ట్రాఫిక్ రద్దీ తగ్గి, శివారు ప్రాంతాలకు ప్రయాణం సులభతరం అవుతుందని అధికారులు వివరించారు.

---------------------------

దేశంలో వ్యాపార నిర్వహణను సులభతరం చేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జన్ విశ్వాస్ బిల్లు – 2026ను పార్లమెంట్ ఇటీవల ఆమోదించింది. ఈ బిల్లుతో జైలు శిక్షల స్థానంలో పౌర జరిమానాలను ప్రవేశపెట్టి, నేర తీవ్రతకు అనుగుణంగా శిక్షలను హేతుబద్ధీకరించడం, చిన్నపాటి పొరపాట్లకు, సాంకేతిక ఉల్లంఘనలకు జైలు శిక్ష విధించే నిబంధనలను తొలగించడమే ప్రధాన ఉద్దేశ్యం. ఈ బిల్లు మొత్తం 23 మంత్రిత్వ శాఖలకు చెందిన, 79 కేంద్ర చట్టాల పరిధిలోని 784 నిబంధనలను సవరిస్తుంది. 717 నిబంధనలు నేరాల జాబితా నుండి తొలగించబడ్డాయి. పాతపడిపోయిన, అనవసరమైన వెయ్యికి పైగా నిబంధనలను హేతుబద్ధం చేయడం ద్వారా ఈ బిల్లు నియంత్రణ వ్యవస్థను మెరుగుపరుస్తుంది.

-----------------------------

దేశవ్యాప్తంగా వలస కార్మికులకు అందిస్తున్న 5 కిలోల ఫ్రీ ట్రేడ్ LPG (ఎఫ్‌టీఎల్) సిలిండర్ల రోజువారీ కేటాయింపును కేంద్ర ప్రభుత్వం రెట్టింపు చేసింది. ఈ మేరకు పెట్రోలియం & సహజ వాయువు మంత్రిత్వ శాఖ కార్యదర్శి నీరజ్ మిట్టల్ అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులకు లేఖ రాసి ఆదేశాలు జారీ చేశారు. ఈ సిలిండర్లను రాష్ట్ర ప్రభుత్వాలు తమ ఆహార, పౌర సరఫరాల శాఖల ద్వారా మాత్రమే వలస కార్మికులకు పంపిణీ చేయాలని స్పష్టం చేశారు. మార్చిలో నిర్ణయించిన 20 శాతం పరిమితిని దాటి, వలస కార్మికుల అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని కేటాయింపులను పెంచినట్లు తెలిపారు. వలస కార్మికులకు అందిస్తున్న సగటు రోజువారీ సరఫరాను ఆధారంగా తీసుకుని కొత్త కేటాయింపులు అమలు చేయనున్నట్లు మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

-----------------------------

పల్నాడు ప్రాంత ప్రజలకు అత్యవసర వైద్య సేవలు అందించే పిడుగురాళ్ల మెడికల్ కళాశాలను నిర్ణీత గడువులో అందుబాటులోకి తెస్తామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రకటించారు. మెడికల్ కళాశాల పనుల పురోగతిపై నరసరావుపేట పార్లమెంటు సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు, గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు, కలెక్టర్ కృతికా శుక్లాతో పాటు వైద్యాధికారులతో మంత్రి సమీక్ష నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో కేవలం 28 శాతం పనులు మాత్రమే జరిగాయని చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వంలో శరవేగంగా కళాశాల నిర్మాణాన్ని పూర్తిచేస్తున్నట్లు మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలియజేస్తూ..

వాయిస్. 25.. సెకన్లు

-----------------------------

ప్రధానమంత్రి ఇంటర్న్ షిప్ ప్రోగ్రాంకు ఆన్ లైన్ పోర్టల్ విధానం ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తిరుపతి జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి ఆర్.లోకనాథం తెలిపారు. తిరుపతి కలెక్టరేట్ లో ఆయన పాత్రికేయులతో ఈరోజు మాట్లాడారు. యువతకు కేవలం చదువే కాకుండా పని అనుభవం కల్పించాలనే లక్ష్యంతో ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ ఫేజ్-3 పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందని చెప్పారు. ఈ నెల 15వ తేదీ లోపు ఆసక్తి గలవారు దరఖాస్తు చేసుకోవాలని నైపుణ్య అభివృద్ధి అధికారి ఆర్.లోకనాథం సూచిస్తూ..

వాయిస్..25 సెకన్లు

-----------------------------

దక్షిణ కోస్తా, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం విస్తరించి కొనసాగుతోందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ఫలితంగా ఉత్తర కోస్తా, యానాం ఈరోజు తేలిక పాటి నుండి ఒక మోస్తరు వర్షం కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారి ఎల్.నారాయణ పేర్కొంటూ..

..వాయిస్.. 20 సెకన్లు

=====================